ప్రజాశక్తి

బుధవారం 13 మార్చి 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా





రెవెన్యూ అక్రమాలు


- ప్రైవేటు వ్యక్తుల పేరుతో శ్రీకాకుళం ఆలయ భూములు మ్యూటేషన్
- చేతులు మారిన రూ.30 లక్షలకుపైగా నగదు
- రెండు గ్రామాల్లో స్థానిక అధికారుల బంధువుల పేర్లతో సిసిఆర్‌సి కార్డులు



ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

కొందరు రెవెన్యూ అధికారులు కాసుల కక్కుర్తితో దేవాలయ భూములకు మ్యూటేషన్ (అడంగల్‌లో పేర్లు మార్పు) చేస్తున్నారు. లక్షల్లో డబ్బులు వసూలు చేసి సాగుదారులకు పాస్‌బుక్‌లు మంజూరు చేస్తున్నారు. కృష్ణాజిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని శ్రీకాకుళేశ్వరస్మామి దేవస్థానం భూముల సాగుదార్లలో కొందరికి మాత్రమే ఈ పాస్‌బుక్‌లు మంజూరు చేయడం చర్చనీయాంశమైంది. దేవాలయ భూముల మ్యూటేషన్లో రూ.30 లక్షలకుపైగా చేతులు మారాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ మండలంలోని కొడాలి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డుల (సిసిఆర్‌సి) మంజూరులోనూ స్థానిక అధికారులు అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని వివిధ సర్వే నెంబర్లలో శ్రీకాకుళేశ్వర స్వామి దేవస్థానానికి 666.4 ఎకరాల భూములున్నాయి. శతాబ్దాల తరబడి వందలాది కుటుంబాలు వారసత్వంగా ఈ భూములను సాగు చేసుకుంటున్నాయి. వారసత్వంగా ఆ భూములను సాగు చేసుకుంటున్నా రెవెన్యూ రికార్డుల్లో ఆలయ భూములుగానే 22 ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయి. ఈ భూములకు రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో భూముల క్రయవిక్రయాలకు అవకాశం ఉండేది కాదు. రెవెన్యూ శాఖలోని కొందరు అక్రమార్కులు ఈ భూములను 22 ఏ జాబితా నుంచి తొలగించి అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పిస్తామని చెబుతూ భారీగా డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. గత ఏడాది జూన్ – ఈ ఏడాది ఫిబ్రవరి మధ్యకాలంలోనే ఈ మ్యూటేషన్ల ప్రక్రియకు తెరలేపినట్లు తెలిసింది. ఒక్కో ఎకరాకు రూ.50 వేల వరకు మామూళ్లు సమర్పించుకున్న వారి పేర్లను రెవెన్యూ అధికారులు రికార్డుల్లో మ్యూటేషన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ గ్రామంలోని 239, 127–38, 137–2, 130, 135, 264, 143, 137–4 137–1, 140–2, 152, 134, 142 సర్వే నెంబర్లలోని దేవస్థానం భూములు 65 ఎకరాలకుపైగా అనువంశికం, సొంతం, పూర్వార్జితం భూముల పేర్లతో ప్రైవేటు వ్యక్తుల పేర్లను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారు. వారి పేర్లతో ఈ పాస్‌బుక్‌లు మంజూరు చేశారు. ఈ వ్యవహారంలో సుమారు రూ.32 (మిగతా 6లో)



పట్టాలు పంపిణీ చేస్తున్న సిఎం జగన్మోహనరెడ్డి; రిటైనింగ్ వాల్‌కు ప్రారంభోత్సవం చేస్తున్న సిఎం (అంతర్‌చిత్రంలో)

కృష్ణా రిటైనింగ్ వాల్‌కు సిఎం ప్రారంభోత్సవం

- అందుబాటులోకి రివర్ ఫ్రంట్ వ్యూ పార్కు
- రూ.239 కోట్లతో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

కృష్ణా నది వెంబడి నిర్మించిన రక్షణ గోడను మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. కృష్ణలంక పరిధిలోని రణదివెనగర్, కోటినగర్, తారకరామనగర్, భూపేష్‌గుప్తానగర్, పోలీసు కాలనీ, రామలింగేశ్వర నగర్ తదితర ప్రాంతాలు కృష్ణానది ముంపునకు గురికాకుండా రూ.369.89 కోట్లతో సుమారు 2.26 కిలో మీటర్ల పొడవున దీనిని నిర్మించారు. కృష్ణా నది వరద ముంపు నుంచి ఈ గోడ శాశ్వతంగా రక్షణ ఇవ్వనుంది. దీంతో పాటుగా కనకదుర్గ వారధి వద్ద ఏర్పాటు చేసిన రివర్‌ఫ్రంట్ వ్యూ పార్కును కూడా ఆయన ప్రారంభించారు. నగర వాసులకు కృష్ణా నది పక్కన ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి తేవాలని విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ దీనిని చేపట్టింది. రక్షణ గోడకు, ఇళ్లకు మధ్య ఉన్న ప్రాంతంలో దీనిని ఏర్పాటు చేశారు. కనకదుర్గ వారధి నుంచి రామలింగేశ్వరనగర్ డిపిస్టేషన్ వరకు ఈ పార్కును ఏర్పాటు చేశారు. సుమారు 1.25 కిలోమీటర్ల పొడవున నిర్మించారు. అయితే ఇంకా పూర్తి స్థాయిలో పనులు చేపట్టాల్సి ఉంది. దాదాపు రూ.12.4 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. దీనిలో రూ.7.8 కోట్లు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ నుంచి, మరో రూ.4.5 కోట్లు అర్బన్ గ్రీనరీ నిధుల నుంచి కేటాయించి ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయించారు. ట్రీకెనాఫీ, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్, రోడ్లు, బేస్‌మెంట్లు ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకింగ్ చేసుకునేందుకు నగర వాసుల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. సుమారు 250 నుంచి 500 మంది ఒకేసారి వాకింగ్ చేసుకునేందుకు వీలుగా సౌకర్యం కల్పించారు. దీంతోపాటుగా ఆహ్లాదాన్ని పంచేందుకు అవసరమైన పచ్చదనాన్ని కూడా అభివృద్ధి (మిగతా 6లో)



'మార్పు కోసం సిపిఎం పాదయాత్ర'లో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

భూ కబ్జాలు చేసే నేతలను ఓడించండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ : అధికారాన్ని అడ్డం పెట్టుకుని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. నగరంలోని అరండల్‌పేటలో మంగళవారం "మార్పు కోసం సిపిఎం పాదయాత్ర" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బాబూరావు మాట్లాడుతూ కాల్వగట్లపై నివాసం ఉంటున్న పేదలను, వారి (మిగతా 6లో)

స్పా సెంటర్లపై పోలీసుల దాడి

- 24 మంది మహిళలకు విముక్తి
- వీరిలో ముగ్గురు విదేశీయులు

ప్రజాశక్తి - విజయవాడ : నగర కమిషనరేట్ పరిధిలోని స్పా సెంటర్లపై మంగళవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ప్రత్యేక బందాలు ముమ్మరగా దాడులు నిర్వహించాయి. డిజిపి ఆదేశాల మేరకు 62 మందితో కూడిన 10 ప్రత్యేక బందాలు పటమట, మాచవరం, పెనమలూరు, ఎస్.ఆర్.పేట పరిధిలోని స్పా సెంటర్లపై ఒక్కసారిగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో స్థానిక మహిళలతోపాటు విదేశీ మహిళలు సైతం వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. ఆరు స్పా సెంటర్లపై జరిపిన దాడుల్లో థాయ్‌లాండ్‌కు చెందిన ముగ్గురు విదేశీ మహిళలతో పాటు 24 మంది మహిళలకు విముక్తి కల్పించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేందుకు వచ్చిన 25 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురు స్పా సెంటర్ల నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఐజి రవి ప్రకాష్ పర్యవేక్షణలో ఈ దాడులు జరిగాయి.



పోలీసుల దాడుల్లో విముక్తి పొందిన మహిళలు



రంజాన్ దీక్షల వేళలు

ఇఫ్తార్ : బుధవారం సాయంత్రం 6.31

సహర్ : గురువారం ఉదయం 5.03

పుల్లూరులో కెడిసిసి బ్యాంకు ప్రారంభం


బ్యాంకును ప్రారంభిస్తున్న తాతినేని పద్మావతి

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని పుల్లూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కెడిసిసి బ్యాంకును మంగళవారం చైర్మన్ తాతినేని పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆ దిశగానే సిఎం జగన్ పరిపాలన చేస్తున్నారని అన్నారు. రైతులకు ప్రభుత్వం ద్వారా అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ స్వర్ణాల తిరుపతిరావు, నియోజకవర్గ పరిశీలకులు అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, ఎఎంసి చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, పుల్లూరు పిఎసిఎస్ అధ్యక్షులు సిహెచ్.రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదులు ప్రారంభం


తరగతి గదులు ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - వత్సవాయి : కన్నేవీడు గ్రామం నందు 39 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదుల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ విప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చేసి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. ఓ వైపు పాఠశాలల్లో వసతులు, మరో వైపు విద్యార్థులకు అవసరమైన సామగ్రి సకాలంలో అందిస్తుండటంతో వారికి కార్పోరేట్ స్థాయి విద్య అందుతోందని తెలిపారు. గ్రామ సర్పంచి సేవా దుర్గారాణి, ఉప సర్పంచ్, ఉప్పర విజయరావ్, ఎంపీటీసీ లావణ్య లక్ష్మి, సామినేని శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.బి

బత్తినపాడులో 'గడప గడపకూ ప్రభుత్వం'

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలంలోని బత్తినపాడు గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు ప్రతి గడపకు వెళ్లి ప్రజలను ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు – లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ మోహన్ రెడ్డి ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంగా సంతోష్ రావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు

పలు అభివృద్ధి పనులు ప్రారంభం


అభివృద్ధి పనులు ప్రారంభించిన సామినేని ఉదయభాను

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వైసిపి ప్రభుత్వంలో చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. పెనుగంచిప్రోలు గ్రామంలో రూ.కోటితో నిర్మించిన ఉద్యానవనం పార్కు, రూ.43 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.32 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలు, 2.83 కోట్లతో ఇంటింటికి పైప్‌లైన్, ఓవర్ హెడ్ ట్యాంక్, సంపు నిర్మాణానికి శంకుస్థాపన, కోటి రూపాయలతో గండి వాగుపై కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన, ఎస్సీ కాలనీలో 26 లక్షలతో సిసి రోడ్డు ప్రారంభ, శంకుస్థాపనల్లో మంగళవారం ఆయన సతీమణి సామినేని విమలభానుతో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర నెడ్ కాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మొట్టమొదటిసారి పెనుగంచిప్రోలు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయంపై సోలార్ విద్యుత్ ఏర్పాటు అభినందనీయమన్నారు. ఎంతో ప్రసిద్ధి చెందిన పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి రాష్ట్ర నలుమూలల నుంచి నిత్యం యాత్రికులు వస్తూ ఉంటారని తెలిపారు.

రహదారి అభివృద్ధి పనులు ప్రారంభం


వెల్లటూరు గ్రామంలో రహదారి పనులు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - మైలవరం : జి.కొండూరు మండలం వెల్లటూరు గ్రామ శివారు నుండి ఆయుష్ హాస్పిటల్ వరకు ఉన్న రహదారి గుంతల పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రహదారి గుండా మైలవరం, నూజివీడు, జి.కొండూరు, విసన్నపేట, విజయవాడ తదితర గ్రామాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. గుంతల మయంగా రహదారి ఉండటంతో ద్విచక్ర వాహన దారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదాలకు నిలయంగా ఉన్న రహదారి గురించి బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈతా కుల జగదీష్, గ్రామ సర్పంచ్ వేల్పూరు సుజానమ్మ, వేల్పూరు మరి అన్న, వైసీపీ గ్రామ అధ్యక్షులు అబిద్రగో లు రహదారి ప్రమాద భరితంగా మారిందని, ప్రమాదాలు జరుగుతున్నాయనివిజయవాడ ఎంపీ కేసినేని నాని, వైసిపి మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ స్వర్ణాల తిరుపతిరావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన వారు మరమ్మత్తుల పనులకు సహకరించడంతో వెల్లటూరు గ్రామ శివారు నుండి ఆయుష్ ఆస్పటల్ వరకు రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. రోడ్డుకు మరమ్మత్తులు చేయడం పట్ల పలువురు హర్షవర్ధం చేస్తున్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ


మిషన్లు అందజేస్తున్న సామినేని

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని బూదవాడ గ్రామ వైసిప నాయకులు మట్టా ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో 25 మంది మహిళలకు మంగళవారం ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొని మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ బూదవాడ గ్రామ నాయకులు మట్టా ప్రతాప్ రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. హైదరాబాదులో ఉంటూ తన సొంత గ్రామమైన బూదవాడ ప్రజల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బూదవాడ గ్రామంలో 600 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలివ్వడం శు భపరిణామన్నారు. రెండు రోజుల్లో ఒక పెద్ద కార్యక్రమం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు పట్టాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - అజిత్ సింగ్ నగర్ : సెంట్రల్ నియోజకవర్గం సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలో గల వైసిపి సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు కార్యాలయం వద్ద వైసిపి 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా డిప్యూటీ మేయర్ అవుతూ శైలజ రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డికి నివాళు లర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు ఈ ఈ సందర్భంగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్ పరిపాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని నవరత్నాల పేరుతో ప్రజలకు కావలసిన అవసరాలు ఎన్నో అభివద్ధి పథకాలు నెరవేర్చారని ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వటం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేటర్లు పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులునాయకులువివిధ కార్పొరేషన్లో చైర్మన్లు డైరెక్టర్లు సచివాలయం కన్వీనర్లు గృహసారథులు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **వన్‌టౌన్ :** 51వ డివిజన్లో స్టాండింగ్ కమిటీ మెంబర్ 51 డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేటర్ రాజేష్ కార్యాలయం వద్ద దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి పూజా కార్యక్రమం నిర్వహించి అనంతరం పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు ఆ తర్వాత కేక్ కట్ చేశారు. **భవానీపురం :** వైసిపి ఆవిర్భావం సందర్భంగా వైసిపి పశ్చిమ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు బండి పుణ్యశీల, మనోజ్ కొఠారి, దూది బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆమిర్భావ దినోత్సవాన్ని మంగళవారం యువ నాయకులు సామినేని వెంకటకష్ణ ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావుతో కలిసి యువ నాయకులు సామినేని వెంకటకష్ణ ప్రసాద్ బాబు పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్, రాష్ట్ర ఎస్టీ విభాగం సెక్రటరీ బద్దు నాయక్, తదితరులు పాల్గొన్నారు. **కంచికచర్ల :** వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం కంచికచర్ల ఘనంగా నిర్వహించారు. పట్టణ వైసిపి అధ్యక్షుడు వేమా సురేష్ బాబు ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ సెంటర్‌లో, గొట్టుముక్కల రోడ్డులో పార్టీ జెండాను నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు ఆవిష్కరించారు. నెహ్రూ సెంటర్‌లో పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ, పార్టీ ఆవిర్భావం దినోత్సవ కేక్ కట్ చేశారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే జగన్మోహన్ రావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల, పరిటాల సర్పంచ్‌లు వేల్పుల సునీత, తదితరులు పాల్గొన్నారు. **మైలవరం :** వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మైలవరంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మైలవరం నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి స్వర్ణాల తిరుపతిరావు కేక్ కట్ చేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మైలవరం నియోజకవర్గ పరిశీలకులు అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అప్పటి సత్యనారాయణ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెంకటరావు, పాల్గొన్నారు. **తిరువూరు :** వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆపార్టీ నాయ కులు కార్యకర్తలు మంగళవారం తిరువూరులో ఘనం గా నిర్వహించారు. బైపాస్ రోడ్డు, అయ్యప్ప దేవాల యం సమీపంలో గల వైఎస్సార్సీపీ నియోజకవర్గ కార్యా లయంలో పార్టీ పతాకాన్ని నియోజకవర్గ ఇన్ ఛార్జ్ నల్ల గట్ల స్వామిదాస్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాజ శేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివా ళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు చల మాల సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సి రెడ్డి, జడ్పిటిసి ఎర్రమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, నగర పంచాయతీ చైర్ పర్సన్ గత్తం కస్తూరి బాయి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామ వైసిపి కార్యాలయంలో మంగళవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్‌రావు జెండా ఆవిష్కరించారు. నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు.



తిరువూరులో


జగ్గయ్యపేటలో వేడుకలు

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఏ ఒక్క పేదకుటుంబం సొంతిల్లు లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఇళ్ల పట్టాల పంపిణీ నిర్ణయం చారిత్రాత్మకమని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లలో భాగంగా సోమవారం రాత్రి పట్టణంలోని బాలుసుపాడు రోడ్డు ఎల్పి 3 లేఅవుట్‌లో 1,470 మంది లబ్ధిదారులకు పట్టాల పంపిణీ, ఎల్పి–1, ఎల్పి–2 జగనన్న కాలనీలోని గృహాలు నిర్మించుకున్న 728 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను ఉదయభాను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు.

సంక్షేమ వారధులు వాలంటీర్లు

జగ్గయ్యపేట : ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వాలంటీర్లు వారధులని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను కొనియాడారు. పట్టణ మార్కెట్ యార్డ్‌లో జరిగిన ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్ర మంలో భాగంగా పట్టణంలోని వాలంటీర్లకు వందన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లా డుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడంలో వాలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. పట్టణంలో సేవా రత్న, సేవా మిత్ర వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందజేసి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను, యువ నాయకులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ బాబు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర రావు, కెడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హాఫిజున్నిస జున్నీసా ఫిరోజ్ ఖాన్, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. స్థానిక 23వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఎసి డిపిఒకె. నాగమణి, సూపర్వైజర్ రజనీజ్వాల ఆధ్వర్యంలో పోషణపక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఇసిసిఇ) గురించి వివరించారు. వార్డు కౌన్సిలర్ పి.రోశయ్య మాట్లాడుతూ పిల్లల అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు ప్రధానపాత్ర వహిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఫణికుమారి, హసీనాబేగం, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడు శంకర్ రాజీనామా

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకులు లగడపాటి శంకర్ పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం మండలంలోని శివపురం గ్రామంలో తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రొటోకాల్ సభ్యత్వానికి రాజీనామా చేసి ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకు లేఖ పంపినట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలు వల్లనే రాజీనామా చేసినట్లు తెలిపారు.

స్ట్రాంగ్‌రూమ్‌లు, పోలింగ్ కేంద్రాల పరిశీలన



స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాబోయే ఎన్నికల్లో ఈవీఎంల భద్రత ఎంతో ముఖ్యమని, అందుకు తగిన సెక్యూరిటీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు భద్రపరిచేందుకు గుర్తించిన స్ట్రాంగ్ రూములు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించారు. పెనమలూరు నియోజకవర్గానికి సంబంధించి గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో, గన్నవరం నియోజకవర్గానికి సంబంధించి గన్నవరంలో జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్, అవనిగడ్డ నియోజకవర్గానికి సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పామర్రు, గుడివాడ, పెడన, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆయా ప్రాంతాల్లోని మార్కెట్ యార్డులలో గుర్తించిన స్ట్రాంగ్ రూములు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు పరిశీలించారు. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, పెనమలూరు నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా ఆర్డీవో డి. రాజు, గుడివాడ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా ఆర్డీవో పద్మావతి, మచిలీపట్నం నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా ఆర్డీవో ఎం వాణి, పెడన నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా ముడ విసి పి. వెంకటరమణ, పామర్రు రిటర్నింగ్ అధికారిగా కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, అవనిగడ్డ రిటర్నింగ్ అధికారిగా గుడివాడ మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రమణ్యం వారి నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలు భద్రపరిచేందుకు గుర్తించిన స్ట్రాంగ్ రూములు, పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ప్రణాళిక జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు షెడ్యూలు ప్రకటించగానే జిల్లా గోడౌన్ నుండి మొదటి స్థాయి ర్యాండమైజేషన్ ద్వారా ఈవీఎంలు వివిధ నియోజకవర్గాలకు పంపడం జరుగుతుందన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత వాటిని మరలా స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచడం జరుగుతుందని, అనంతరం కౌంటింగ్ కోసం మచిలీపట్నంలోని కృష్ణ విశ్వవిద్యాలయంలో కౌంటింగ్ కేంద్రానికి తరలించడం జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు, నిషేధిత ప్రాంతంగా అవసరమైన సెక్యూరిటీ సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు.

మోపిదేవి ఆలయంలో చంద్రశేఖర్

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని మచిలీపట్నం పార్లమెంటు వైసిపి ఇన్చార్జి సింహాద్రి చంద్రశేఖర్, సింహాద్రి రామ్‌చరణ్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. స్వామివారి నాగపుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.



పెనమలూరు అభివృద్ధే లక్ష్యం : జోగి

పెనమలూరు: ప్రజా సంక్షేమం, పారదర్శకతతో కూడిన పాలన, పెనమలూరు నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. మంగళవారం పెనమలూరు నియోజకవర్గంలో ఆయన పలు సిసి రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఉదయం తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని గుంటతిప్ప డ్రైన్ రోడ్డు నుండి విజయ దుర్గ ఆగ్రో ఇండస్ట్రీస్ వరకు 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత వైఎస్ఆర్ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని సనత్ నగర్ నుంచి సిద్ధిక్ నగర్ వరకు 33 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు శంకుస్థాపన



చేశారు. అనంతరం వైయస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కారూరు దళితవాడ పరిధిలో 70 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా పలు రోడ్లకు శంకుస్థాపన చేసి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసిపికి మద్దతుగా నిలవాలని కోరారు.

వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-పెడన: పెడన పట్టణ, రూరల్ ప్రాంతాల్లో వైసిపి 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ సమన్వయకర్త ఉప్పాల రాము ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో, మున్సిపల్ ఆఫీస్ వద్ద, బంటుమిల్లి రోడ్డు సెంటర్‌లో ఉన్న వైయస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ కటకం నాగ కుమారి ప్రసాద్ ఆధ్వర్యంలో పట్నంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మిఠాయిలు పంచి కేకను కట్ చేశారు.కట్లపల్లి, సింగరాయపాలెం, బల్లిపర్రు, మడక, నందమూరు గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గరికపాటి చారుమతి రామనాయుడు, ఎంపీపీ రాజులపాటి వాణి పాల్గొన్నారు. **గన్నవరం:** మర్లపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు సర్నాల శంకర్ ఆధ్వర్యంలో అవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ అనగాని రవి, మండల పార్టీ అధ్యక్షుడు నీలం ప్రవీణ్ హాజరయ్యారు. మర్లపాలెం నుంచి గన్నవరం వరకు యువత బైక్ ర్యాలీ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ సర్నాల అంజనేయలు, సోషల్ మీడియా గన్నవరం మండల కో కన్వీనర్ దేవరపల్లి విజయ్ రామ్ పాల్గొన్నారు. వైసిపి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, జడ్పీటీసీ ఏఈ రాణి పాల్గొన్నారు. **గుడివాడ:** స్థానిక వైసీపీ కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళు లర్పించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఎంవి నారాయణరెడ్డి, మాదాసు వెంకటలక్ష్మి, షేక్ బాజీ, వెంపటి సైమన్, మండలి హనుమంతరావు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్:** బాపులపాడు మండలం వీరవల్లిలో పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. వై.ఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ గూడవల్లి రత్న సుధాకర్, కోడేబోయిన బాబి, పిఎసిఎస్ అధ్యక్షురాలు అల్లాడి తెరిసా పాల్గొన్నారు. వైస్.ఎంపీపీ చందు రమాదేవి, శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో కోడూరుపాడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు చందు శివ, ఆళ్ల భాను, అమ్మిటి రంగారావు పాల్గొన్నారు. కొత్తమల్లవల్లి గ్రామంలో బాపులపాడు మండలం పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ తానీషా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. **అవనిగడ్డ:** అవనిగడ్డ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కడవకొల్లు నరసింహారావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, సింహాద్రి వికాస్, ఎంపీపీ తుంగల సుమతిదేవి తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల:** ఘంటసాల ప్రధాన సెంటర్లో, వైసిపి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వైసిపి జెండాను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కష్ణా,ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల రైతు విభాగం రీజినల్ కోఆర్డినేటర్ కడవకొల్లు నరసింహారావు, ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, జడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, సింహాద్రి వికాస్ పాల్గొన్నారు.



గుడివాడలో...



ఘంటసాలలో...



పెడనలో...



విద్యార్థులకు స్పెల్ బి పోటీలు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: విద్యార్థుల్లో పదజాలంపై నైపుణ్యం, భావజాలనైపుణ్యం పెంపొందించుకునేందుకు స్పెల్బీ పోటీలు ఉపయోగపడతాయని ఏపీపీఎస్ఏ జిల్లా అధ్యక్షుడు గౌరీప్రసాద్ అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లి గీతాంజలి హైస్కూల్లో అప్సా (ఏపీపీఎస్ఏ) గన్నవరం డివిజన్ ఆధ్వర్యంలో చెందిన 1 నుండి 10వ తరగతి వరకు 11 పాఠశాలల్లోని విద్యార్థులకు స్పెల్బీ పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. డివిజన్ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలచిన విజేతలు జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బి. శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి వీడీఎస్ ప్రసాద్, గీతాంజలి హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్. మన్మోహన్, జిల్లా కోశాధికారి ఎస్. పూర్ణచంద్రాచార్యులు పాల్గొన్నారు.

200 మందికి అన్న సమారాధన

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: స్థానిక హనుమాన్ జంక్షన్లో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం 200 మంది యాత్రికులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారుజాము నుండి యాత్రికులు అత్యధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ రామాయణం రాఘవ రాజు, మనీషా దంపతులు వారి కుమారుడు అన్నప్రాసన వేడుక, నామకరణ సందర్భంగా అన్న ప్రసాద వితరణకూ సహకరించారు. దాత రామాయణం రాఘవరాజు దంపతులు పేరు మీద అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.యాత్రికులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. దేవాలయ సాంప్రదాయం ప్రకారం దాత రామాయణం రాఘవను చైర్మన్ నేర్సు భూషణం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవో కూచిపూడి శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది, సేవ బందం తదితరులు పాల్గొన్నారు.





గుడివాడ సమస్యల పరిష్కారానికి కృషి : రాము

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదని టిడిపి అభ్యర్థి, నియోజకవర్గ ఇంచార్జ్ వెనిగండ్ల రాము ప్రజలకు భరోసా ఇచ్చారు. గుడివాడ 2వ వార్డులో బాబు ష్యూరిటి భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటూ టీడీపీ సూపర్ సిక్స్ మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించారు. గుడివాడలో అభివద్ధి సంగతి దేవుడెరుగు, కనీసం మౌలిక వసతులయినా కల్పించాలని వాడవాడలా ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేని స్థితిలో ఎమ్మెల్యే ఉన్నాడన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సీనియర్ టిడిపి నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, లింగం ప్రసాద్, కొడాలి రామరాజు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, జనసేన నాయకులు కొదమల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగునికి సాయం



వికలాంగునికి పాన్ షాప్ అందజేసిన దాతలు

ప్రజాశక్తి - భవానీపురం : సివిఆర్ లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో విజయవాడ నగరంలో అనేక ప్రాంతాల్లో అన్న దానం, నిరుపేదలకు వస్త్ర దానం, వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు క్లబ్ ప్రెసిడెంట్ తాటి వెంకట నారాయణ అన్నారు. రంజాన్ ఉపవాసాలు మొదలు పెట్టిన సందర్భంగా విద్యాధర పురంలోని చెరువు సెంటర్, మోడ్రన్ చాయ్, టీ సెంటర్‌లో మంగళవారం షేక్ అఖ్రుద్దీన్ అనే నిరుపేద వికలాంగునికి పాన్ షాప్‌ను ఏర్పాటు చేసి ప్రారంభం కార్యక్రమంలో నారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమానికి దాత గోవాడ సదాశివరావు అధ్యక్షత వహిస్తూ ఒక నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తికి జీవనోపాధి కలిగించడం, అదీ పవిత్ర రంజాన్ నెలలో కార్యక్రమం ప్రారంభించడం ఆనంద దాయకమన్నారు. జిల్లా వ్యాప్తంగా 100కు పైగా లయన్స్ క్లబ్‌లు రోజూ ఏదో ఒక ప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని జిల్లా కేబినెట్ నాయకులు ఎమ్.ఎస్.ఇమామ్ బాషా అన్నారు. క్లబ్ సెక్రెటరీ ఎన్.శ్రీనివాసరావు ఇప్పటి వరకు క్లబ్ ద్వారా చేసిన కార్యక్రమాల నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ నాయకులు ఎన్.వి.ఎస్. కృష్ణారావు, పి.వెంకట రమణ, నరేంద్ర కుమార్, పి.వి.హనుమంత రావు, బి.వెంకటేశ్వర రావు, టి.వెంకటేశ్వర రావు, జి.శ్రీనివాస రావు, టీ స్టాల్ యజమాని అబ్దుల్ వాహెద్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి - తిరువూరు : తన తల్లితో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని ఒక వ్యక్తి మరో వ్యక్తిపై దాడి చేసిన సంఘటన సోమవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ కథనం ప్రకారం... తిరువూరు సుందరయ్య కాలనీకి చెందిన జొన్నలగడ్డ సురేష్ (40) అదే కాలనీలోని ఒక వివాహితతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీన్ని జీర్ణంచుకోలేని ఆమె చిన్న కొడుకు ఓర్సు ప్రవీణ్, బంధువు అయిన చిన్ననానితో కలిసి సోమవారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో సురేష్‌పై అతని ఇంటి ముందు దాడిచేసి రాళ్లతో తలను చితకబాదారు. దీనితో తీవ్ర గాయాలై రక్తపు మడుగులో పడి ఉన్న సురేష్‌ను కుటుంబ సభ్యులు ఒక ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుండి మెరుగైన చికిత్సకోసం విజయవాడ తరలించారు. సురేష్ పరిస్థితి విషమంగానే ఉంది. ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భవానీ ముక్తేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని ముక్త్యాల గ్రామంలో గల శ్రీ భవాని ముక్తేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీని మంగళవారం దేవస్థానం అధికారుల సమక్షంలో లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి సి జయ ప్రకాష్ బాబు, దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రతినిధి పి.రాంప్రసాద్ ఆధ్వర్యంలో హుండీలను లెక్కించగా మహాశివరాత్రి పండగ సందర్భంగా దర్శనం టికెట్ల ద్వారా 2,05,680 రూపాయలు, అభిషేకం ద్వారా రూ.79,150లు, కానుకల ద్వారా 2,77,500, లడ్డు ప్రసాదం విక్రయం ద్వారా రూ.1,45 లక్షలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకున్న హక్కు ద్వారా రూ.41,500, హుండీల ద్వారా రూ.3,26,752 లు వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి సి.జయ ప్రకాష్ బాబు తెలిపారు. ఉత్సవాల ప్రధాన అధికారి ఎస్.హేమలతాదేవి, దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రతినిధి పి రాంప్రసాద్ పర్యవేక్షణలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు టిఫిన్ క్యాంటీన్లు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో జనసేన, టిడిపి, బిజెపి లక్ష ఓట్లు లక్ష్యంగా పనిచేయాలని జనసేన పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి పోతిన వెంకట మహేష్ అన్నారు. స్థానిక 35వ డివిజన్ పరిధిలో నాయకులు ప్రదీప్ రాజ్ ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని చిరువ్యాపారులకు పోతిన మహేష్ సొంత నిధుల నుండి 2 స్టీలు టిఫిన్ క్యాంటీన్లను పంపిణీ చేశారు. డివిజన్ నాయకులు ప్రదీప్ రాజ్ టిడిపి నాయకులు హనుమంతరావు, నందనమ్మ, చార్లెస్కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ముందుగా రంజాన్ ఉపవాస దీక్షల ప్రారంభం సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

కాలుష్య నివారణ చేపట్టాలి : ప్రజాపోరాట సమితి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎన్‌టిటిపిఎస్ కాలుష్య నియంత్రణ ప్రజా పోరాట సమితి సభ్యులు గుంటుపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుంటుపల్లి ప్రజలు పాల్గొని తమ గోడును పోరాట సమితి సభ్యులకు వినిపించారు. గుంటుపల్లి తాగే నీళ్లలో బూడిద పేరుకుపోతుంది. అత్యంత దౌర్భాగ్యమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బూడిద కాలుష్యం వలన ప్రాణాలు పోతున్నాయి, ఇక ఉపేక్షించలేమని తప్పకుండా పోరాటానికి సహకరిస్తామని తెలిపారు. తమ బతుకులు బాగుపడడానికి ఎంత దూరమైనా వస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని పోరాట సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోరాట సమితి సభ్యులు వేణుగోపాలరావు, చెరుకుమల్లి సురేష్, నరసింహ రెడ్డి, మాధురి, భవాని, సుజాత, కల్పనా,భద్ర, లక్ష్మి, సుబ్రహ్మణ్యం, గుంటుపల్లి ప్రజలు పాల్గొన్నారు.



కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ఇంజినీరింగ్ విద్యార్థులకు సదస్సు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంలో భాగంగా పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)లో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న 650 మంది విద్యార్థులకు "నవభారత్ నిర్మాణం ఇంజనీరింగ్ విద్యార్థులు" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ గరికిపాటి నరసింహారావు, కళాశాల కార్యదర్శి పి. లక్ష్మణ స్వామి , ప్రిన్సిపల్ డా జె లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపల్ డా. ఏ. పతాంజలి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన గరికపాటి


ఉపాధ్యాయినీలను సన్మానిస్తున్న దృశ్యం

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రెడ్డిగూడెం శాఖ ఆధ్వర్యంలో రెడ్డిగూడెం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలనుద్దేశించి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పటాపంచల భవాని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో మరింత ముందుకు సాగాలని అన్నారు. వివిధ వత్తులలో ఉన్నటువంటి మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారనీ, వాటిని పరిష్కరించి మహిళలకు మరింత ఆత్మస్థైర్యం నింపే విధంగా ప్రభుత్వాలు పనిచేయాలని కోరారు. రెడ్డిగూడెం గ్రామ సర్పంచి మల్లాది రాణి, రెడ్డిగూడెం హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు ధర్మశీల మాట్లాడుతూ మహిళలకు రాజకీయ స్వాతంత్రం వచ్చింది కానీ ఆర్థిక స్వాతంత్రం రాలేదని విద్యార్థులకు చిన్నతనం నుండే సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండేలాగా తయారు చేయాలని కోరారు. అనంతరం వివిధ రంగాల్లో ఉన్నటువంటి మహిళలను యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కార్యదర్శి పి.సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని సుజాతకు సన్మానం


ఉపాధ్యాయినీని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని ధర్మవరప్పాడు తండ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సీనియర్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయిని వి.సుజాతని ప్రధానోపాధ్యాయిని కసుకుర్తి మంగతాయమ్మ, పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆరోగ్య మేరి, దయామణి, వసంత, పల్లవి, బాలాజీ, పర్చా లక్ష్మణరావు, విద్యార్థులు పుష్పగుచ్చం అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

రంజాన్ మాసం ఎంతో పవిత్రం : షేక్ ఆసిఫ్

ప్రజాశక్తి - భవానీ పురం : రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జనాబ్ షేక్ ఆసిఫ్ అన్నారు. రంజాన్ మాసం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం విద్యాధరపురంలోని లేబర్ కాలనీలో ఉన్న మదీన మసీదు ఆవరణలో నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమంలో ఆసిఫ్ ఇతర ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ ఇస్లాంలో రంజాన్ మాసానికి అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా ఛైర్మన్ గౌస్‌మొహిద్దీన్, పార్టీ నేతలు మైలవరపు దుర్గారావుగారు, బాజీబాబా పాల్గొన్నారు.

సిఎం సమక్షంలో వైసిపిలో చేరిక



ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ నియోజక వర్గానికి చెందిన 43వ డివిజన్ టిడిపి డివిజన్ ప్రెసిడెంట్ దూది బ్రహ్మయ్య యాదవ్ మంగళవారం ఎంపీ కేశినేని నాని ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు.

'గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి'

ప్రజాశక్తి - మైలవరం : గీతాంజలి మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, గీతాంజలి కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందని వైసిపి మైలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి స్వర్ణాల తిరుపతిరావు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఇంటి పట్టా వచ్చిందని ఆనందాన్ని వెలిబుచ్చినందుకు గీతాంజలి అనే మహిళను టిడిపి నాయకులు సోషల్ మీడియా వేదికగా హింసించారని ఆమె మరణానికి కారణమయ్యారని అన్నారు. కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియా ద్వారా వ్యవహరించిన తీరు వల్లే గీతాంజలి మృతిచెందిందని దీనికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. **జగ్గయ్యపేట :** తెనాలి మహిళ గీతాంజలి ఘటనపై రాష్ట్ర ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వైసిపి కార్యాలయంలో ఎదుట యువ నాయకులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలు కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. **నందిగామ :** సభ్య సమాజం తలదించుకునేలా సోషల్ మీడియాలో ట్రోల్స్ చేసి తెనాలి పట్టణానికి చెందిన గీతాంజలి మృతికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గ వైసిపి లీగల్ సెల్ కన్వీనర్ అద్దంకి మణి బాబు మంగళవారం డిమాండ్ చేశారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అజిత్ సింగ్‌నగర్ స్వర్గీయ కళ్ళే లలిత వీధిలో పేదలకు మంగళవారం అన్నసమారాధన నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కళ్ళే లలిత ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మి, కళ్ళే జయదుర్గలు, మేఘవాణిలు పాల్గొని స్వర్గీయ కళ్ళే లలిత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి కళ్ళే లలిత ట్రస్ట్ అధినేత కళ్ళే నాగేశ్వరరావు పాల్గొని పేదలకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపి మాజీ ఫ్లోర్ లీడర్ గుండారపు హరిబాబు, ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్,జి.ధ్రువన్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రిలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో 20న హుండీ లెక్కించున్నట్లు కార్యనిర్వహణాధికారి శిరపరపు హేమలత దేవి తెలిపారు. దేవదాయ శాఖ అధికారులు, దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త ప్రతినిధి సమక్షంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దళితుడా మేలుకో కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురాం నివాసంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సొంగ సంజయ్ ఆధ్వర్యంలో మంగళవారం దళితుడా మేలుకో అనే కరపత్రంను ఆవిష్కరించారు. ఈ సందర్భం గా నెట్టెం శ్రీ రఘురాం మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో దళితులపై దాడులు ఎక్కువయ్యాయని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండంగా దళితుల సంక్షేమం కోసం కింది పేర్కొన్న 27 సంక్షేమ పథకాలు రద్దు చేశారని తన ఆవేదనను వెలిబుచ్చారు.

క్రిస్టియన్ సెల్ ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ సమీపంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్ నందు టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట తెలుగుదేశం పార్టీ అభ్యర్థి శ్రీ రామ్ రాజగోపాల్, సీనియర్ టిడిపి నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ సెల్ వారు నిర్వహించే దైవ సేవకుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు, రాష్ట్ర క్రిస్టియన్ నాయకులు కామ దేవరాజు, ఇత్తడి చార్లెస్, చాట్ల రాజశేఖర్, ప్రత్తిపాటి ఆశీర్వాదం, ఊర్ల మోహన్ రావు పాల్గొన్నారు.

కాళీమాతకు వెండి తొడుగు వితరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని కోదాడరోడ్డులోని శాంతినగర్‌లో గల శ్రీ కలకత్తా కాళీమాత విశ్వరూప శివ దుర్గా భవానీ అమ్మవారి 14 వ వార్షికోత్సవం సందర్భంగా రెండో రోజు మంగళవారం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం తదితర కార్యక్రమాలను విద్యోపాసకులు గోస్వామి, అనుముల భరద్వాజ్ నిర్వహించారు. ఆలయ అర్చకులు తానూరి శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలోని చెరువు బజార్‌కు చెందిన కుంచపు నాగరాజు, రేవతి దంపతులు అమ్మవారికి రూ.25వేల విలువైన వెండి ముఖ తొడుగు అలయ అర్చకులు తానూరి శ్రీనుకు అందజేశారు.

మంచినీటి పైపులైన్ ఏర్పాటులో అవినీతి



జెసికి వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం పంచాయతీ అధికారులు, పాలకవర్గంలోని ఒకరు కలిసి ఎటువంటి అనుమతులు లేకుండా చంద్రిక అయోధ్య అపార్ట్మెంట్‌లకు మంచినీటి పైప్‌లైన్ వేయిస్తున్నారని, దాని వెనుక కోటి రూపాయలు చేతులు మారాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా, మాజీ ఉపసర్పంచ్ జాస్తి శ్రీధర్ రావు, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ ఆరోపించారు. మంగళవారం ఈ వ్యవహారంపై జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు ఫిర్యాదు చేశారు. అనంతరం గన్నవరంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ తుల్లిమిల్లి ఝాన్సీ లక్ష్మి , జనసేన మండల అధ్యక్షులు చిమటా రవివర్మ, మాజీ వార్డు సభ్యులు సులోచన, మహమ్మద్ రఫీ, చిమటా శ్రీనివాసరావు, న్యాయవాది జాస్తి తాతారావుతో కలిసి మాట్లాడారు. గన్నవరం పంచాయతీలో వేసవి వస్తే ప్రజలకు తాగునీరు అందించలేని పరిస్థితి వెంటాడుతుందని పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టు స్కీంలో ఇప్పటికే నీరులేని లేకుండా పోయిందని, రానున్న వేసవిలో ప్రజలకు నీరు అందించడం ప్రశ్నార్థకం అవుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి మంచినీటి సమస్య రాకుండా చూసేందుకు పటిష్ట చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆ పని చేయకుండా భారీగా సొమ్ము తీసుకుని చంద్రిక అయోధ్యకు నీళ్ల ఇవ్వడానికి హడావుడిగా పైపులైన్ వేయిస్తున్నట్లు చెప్పారు. ఈ అపార్ట్మెంట్‌కు మంచినీళ్ల ప్రస్తుతం ఇవ్వకూడదని పంచాయతీ పాలకవర్గం గతంలో తీర్మానం చేసిందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కూడా అనుమతులు ఇవ్వలేదన్నారు. అయినా పంచాయితీ అధికారి, పాలకవర్గంలోని ఒకరు కలసి అపార్ట్మెంట్ యజమానుల నుంచి పెద్ద ఎత్తున డబ్బు దండుకుని రాత్రికి రాత్రి పైప్ లైన్ వేసే పనులు హడావుడిగా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ పైప్‌లైన్ ద్వారా నీళ్ల సరఫరా చేస్తే గన్నవరంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తప్పవన్నారు. ఈ అవినీతి, అక్రమ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, డిపిఓ రంగంలోకి దిగి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

పనులు నిలుపుదల చేయాలి : సిపిఎం

గన్నవరం పంచాయతీ అధికారులు చంద్రిక అయోధ్య అపార్ట్మెంట్‌కు మంచినీటి సరఫరా కోసం ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ నిర్మాణ పనులు తక్షణమే నిలుపుదల చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.ఆంజనేయులు, గన్నవరం పట్టణ కార్యదర్శి మిరప నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇప్పటికే మంచినీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ నేపథ్యంలో కొత్తగా 470 అపార్ట్మెంట్లు కలిగిన భవన సముదాయానికి మంచినీటి లైన్ ఏర్పాటు చేయడం వల్ల నీటి ఇబ్బందులు ఎక్కువవుతాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

జెసికి టిడిపి నేతల ఫిర్యాదు



నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-గుడివాడ: పట్టణంలో విశిష్టత కలిగిన శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం, శ్రీ దేవరకొండ నాగన్న గారి ధర్మసత్రం నూతన కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) మాట్లాడుతూ శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ దేవరకొండ నాగన్న ధర్మసత్రంల అభివృద్ధికి జగన్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశి భూషణ్, వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా యూత్ అధ్యక్షుడు మెరుగుమాల కాళి, జిల్లా అధికార ప్రతినిధి ఎంవి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

'వైసిపికి బుద్ధి చెబుతాం'

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): గత ఎన్నికల్లో మోసపూరిత హామీలతో దళితుల ఓట్లను కొల్లగొట్టిన జగన్‌మోహనరెడ్డికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణరావు మాట్లాడుతూ దళితులకు ఎంతో ఉపయోగపడే అంబేద్కర్ విదేశీ విద్యను, బెస్ట్ ఎవైల్ బుల్ స్కూల్స్ పథకం ఎందుకు రద్దు చేశారో చెప్పాలన్నారు. టిడిపి హయాంలో దళితుల సంక్షేమం కోసం 27 పథకాలు పెట్టి వారి అభివృద్ధికి దోహదపడితే వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసి దళితులను ఆర్థికంగా దెబ్బతీసిందన్నారు. సుమారు 33 వేల కోట్ల ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారన్నారు. 12 వేల ఎకరాల దళితుల అసైన్డ్ భూములను బలవంతగా స్వాధీనం చేసుకొని తీవ్ర అన్యాయం చేశారన్నారు. సుమారు 50 వేల బ్యాక్‌లాగ్ పోస్ట్ లను భర్తీ చేయలేని దళిత ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు.

చిత్రలేఖనంలో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-గన్నవరం: విద్యార్థులలోని సజనకు పదును పెడితే ఏ రంగంలో నైనా నైపుణ్యాన్ని సాధించటం సులభ సాధ్యమని సెయింట్ జాన్స్ ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్ కుమార్ తెలిపారు. పాఠశాల విద్యార్థులు డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ, కెయల్ యూనివర్సిటీ విజయవాడ మరియు వారు సయుక్తంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో పాల్గొని ప్రతిభను సాటిన విద్యార్థుల అభినందన కార్యక్రమం మంగళవారం పాఠశాలలో జరిగింది. ప్రిన్సిపాల్ రెవ. బ్రదర్. సంతోష్‌కుమార్ మాట్లాడుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరచడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణనిచ్చిన ఉపాధ్యాయులు డి.శ్రీనివాసరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రెవ.బ్రదర్ జిమ్మీకురియేకోస్, రెవ.బ్రదర్. భల్లాజోసఫ్, రెవ. బ్రదర్ జయబాలన్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కోడూరు: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి కోడూరు మండల టిడిపి నేతలు ఆర్థిక చేయూత అందించారు. గత నాలుగు రోజుల క్రితం కోడూరు శివారు యర్రారెడ్డి పాలెం గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించి ఆర్థికంగా నష్టపోయిన కోట నాగ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను కోడూరు మండల టిడిపి నేతలు మంగళవారం పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, పూతబోయిన శ్రీనివాసరావు, వేములపల్లి రాజేష్, పిల్లి మల్లికార్జునరావు, గోగినేని సోమశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ , జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నావిస్ హెన్‌ఆర్ వారిచే ఏఎన్ఎం జిఎన్ఎం మరియు బిఎస్సి (బిఎస్‌సి) నర్సింగ్ చదువుకున్న వారికి జపాన్‌లో కేర్ వర్కర్స్ ఇన్ హాస్పిటల్స్/ కేర్ హోం ఫెసిలిటీగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్ బాబు మరియు కష్ణా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి యస్.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగి వారు https://www.apss-dc.in/home/onlineProgram వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9966788993కు సంప్రదించాలని సూచించారు.



రచయిత్రి విజయలక్ష్మికి పురస్కారం

ప్రజాశక్తి-గుడివాడ: తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో మంగళవారం షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఘనంగా మహాకవయిత్రి మల్లహో 700వ జయంతి వేడుకలు, పురస్కార క్యారక్రమాన్ని సమితి సమన్వయకర్త డిఆర్‌బి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టూటౌన్ సిఐ దుర్గారావు పాల్గొని మాట్లాడుతూ భారత ఇతిహాస చరిత్రలో రామాయణం ప్రత్యేకతలు సంతరించుకుందన్నారు. క్రీస్తు శకం 15వ శతాబ్దంలో మల్ల రచించిన రామాయణం ఆమె పేరుతోనే మల్ల రామాయణంగా ఈనాటికీ విరాజిల్లుతుందన్నారు. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మిక రచనా శిరోమణి నారాయణ విజయలక్ష్మికి మల్ల సాహితీ పురస్కారం 2024ను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడిపర్తి సునీత, నారాయణం శ్రీనివాసమూర్తి, జెవి కుమారి, గ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి ఆక్రమణలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

హనుమాన్ జంక్షన్ కూడలి నుంచి ప్రధాన రహదారిపై ఫుట్ పాత్, డ్రైనేజీల మీద ఉన్న ఆక్రమణలను తొలిగించాలని కోరుతూ బాపులపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు తొలగించాలని కోరుతూ లిఖితపూర్వకంగా హనుమాన్ జంక్షన్ ఎస్ఐ జనార్ధన్ కు, గ్రామ పంచాయితీ కార్యనిర్వాహణ అధికారికి ఫిర్యాదు కాపీని అందించారు. ఫిర్యాదు పత్రంలో నిబంధనలకు వ్యతిరేకంగా ఫుట్ పాత్, డ్రైనేజీలపై చేపట్టిన అక్రమ నిర్మాణాలను ప్రస్తావిస్తూ వాటి వలన జరిగే అనర్ధాలను వివరించారు. నిబంధనలను పాటించని దుకాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పాదచారులకు నడిచేందుకు సౌకర్యాలను కల్పించాలని కోరారు.

బందరు అభివృద్ధికి కలిసి పని చేద్దాం : కొల్లు



ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి మచిలీపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని మాజీ మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం నగర పరిధిలోని పలువురు వైసిపి కార్యకర్తలు మంగళవారం టిడిపిలో చేరారు. వీరికి కొల్లు రవీంద్ర పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐపిసి కరుణ్ కుమార్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ పాషా, పిప్పళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామంలో వేచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం నూతన పాలకవర్గ సభ్యురాలుగా యార్లగడ్డ లక్ష్మితో ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. ప్రభుత్వ నియామకపు ఉత్తర్వుల మేరకు ఆలయ కార్య నిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు ప్రమాణ స్వీకారం చేయించారు. గతంలో 9 మంది సభ్యులకు 8 మందితో పాలకవర్గ సభ్యులతో నిర్వహణ కొనసాగుతుంది. మిగిలిన ఒకరిని వేమవరం గ్రామానికి చెందిన యార్లగడ్డ లక్ష్మిని నూతనంగా నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శేషం వీర వెంకట కృష్ణమూర్తి పాల్గొన్నారు.


కొడాలికి మైనార్టీల సంక్షేమం పట్టదు : ఇబ్రహీం

ప్రజాశక్తి-గుడివాడ: నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కొడాలి నాని ముస్లీం మైనార్టీల సంక్షేమానికిగానీ, అభివృద్ధికిగానీ కనీసం రూ.10 లక్షలు కూడా ఖర్చు చేయలేదని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ షేక్ ఇబ్రహీం అన్నారు. మంగళవారం స్థానిక నైజం పేటలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ కొడాలి నానిని కొంత మంది వైసిపి నేతలు దేవుడిగా పోల్చడం బాధగా ఉందన్నారు. తనపై ఎవరైన ఆరోపణలు చేయాలంటే ఆధారాలు చూపించి చేయాలని హితవు పలికారు.

వైఎస్సార్ చేయూత పంపిణీ

ప్రజాశక్తి-పెదపారుపూడి: పేద మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన పెదపారుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాల్గో విడత వైఎస్సార్ చేయూత చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, ఏపీఎం వసంతరావు, సర్పంచులు, అప్పికట్ల ఆశాజ్యోతి, శ్రీదేవి, పునుకొల్లు శివరామప్రసాద్, నాగదేశ్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి: రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి గెలుపే పేదల గెలుపని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో వైయస్సార్ చేయూత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రైతు విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ కడవకొల్లు నరసింహారావు, నియోజకవర్గ యువనాయకుడు సింహాద్రి వికాస్‌బాబు, వైసీపీ మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యనారాయణ (నాని), సర్పంచులు వల్లూరు ఉమా, మాతంగి రమ్య తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

చీటీల వ్యాపారికి జైలు, జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : చీటీలు వేసి మోసం చేసిన కేసులో నిందితుడిఇ మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పటమట పోలీస్ స్టేషన్లో సిఆర్ నెంబరు 619/2009 అండర్ సెక్షన్ 403, 420, 406 ఐపిసి మరియు సెక్షన్ 5 ఆఫ్ ఎపిపిడిఎఫ్ఇ యాక్ట్ – 199 కింద నమోదైన కేసులో నిందితుడైన విజయవాడ పటమట డొంకరోడ్డుకు చెందిన 35 ఏళ్ల బండపల్లి శ్రీనివాసరావుపై నేరం రుజువైనందున మంగళవారం ఎనిమిదవ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జ్ డి.లక్ష్మి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి కంకిపాడుకు చెందిన వ్యక్తి విజయవాడ బందర్ రోడ్డులోని శ్రీ భరత్ చిట్ ఫండ్ కంపెనీలో లక్ష రూపాయల చిట్ చేశాడు. సదరు చిట్ వాయిదాలను పూర్తిగా కడుతున్నాడు. ఈ క్రమంలో చిట్ వేసిన వ్యక్తి చనిపోగా, ఆమె భార్య అయిన ఫిర్యాది క్రమం తప్పకుండా పూర్తిగా చిట్ డబ్బులు కట్టింది. అయితే సమయం పూర్తయినా నిందితుడు డబ్బులు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నాడు. ఈ విషయంలో శ్రీ భరత్ చిట్ ఫండ్ కంపెనీ యజమాని అయిన బండపల్లి శ్రీనివాసరావును డబ్బులు అడుగగా చెక్ ఇచ్చాడు. అయితే అది బౌన్స్ అయ్యింది. అనేక సార్లు అడిగినా డబ్బులు ఇవ్వకుండా తిప్పుకుంటుండడంతో శ్రీనివాసరావు మోసం చేసినట్లు బాధితురాలు 2009 నవంబరు 23న పటమట పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జడ్జి డి.లక్ష్మి మంగళవారం మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా నుండి రూ.99 వేలను బాధితురాలికి ఇచ్చేవిధంగా, మిగిలిన రూ.1000 న్యాయస్థానానికి జరిమానా కట్టాల్సిందిగా తీర్పునిచ్చారు. ఈకేసులో ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడ్డం రవి కిషోర్, సిఎంఎస్ ఇన్‌స్పెక్టర్, అప్పటి ఎస్ఐ పి.మురళి రామకష్ణ పర్యవేక్షణలో 10 మంది సాక్షులను కోర్టులో విచారించారు.

గోడౌన్లు ప్రారంభం

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో నాబార్డు నిధులతో దేవరకోట, ఘంటసాల గ్రామాల్లో రూ.80 లక్షలతో బహుళ ప్రయోజన సౌకర్య గోదాములను మంగళవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కష్ణా, గుంటూరు జిల్లాల వ్యవసాయ విభాగం ఇంచార్జి కడవకొల్లు నరసింహారావు, యువనేత సింహాద్రి వికాస్, ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, ఎంపీపీ వేమూరి రజిని కుమారి, తదితరులు పాల్గొన్నారు.



గోడౌన్లను ప్రారంభిస్తున్న ఎంఎల్ఏ సింహాద్రి రమేష్‌బాబు

బాలికలను వేధించిన కేసులో యువకుడికి జైలు

ప్రజాశక్తి - విజయవాడ : బాలికలతో అసభ్యకరంగా మాట్లాడుతూ వేధిస్తున్న కేసులో నిందితుడికి విజయవాడ పోక్సో కోర్ట్ స్పెషల్ జడ్జి డాక్టర్ ఎస్.రజిని రెండేళ్ల కఠిన కారాగార శిక్షా, జరిమానా విధించారు. కష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని చలసాని నగర్ రాణిగారితోట చెందిన పదేళ్ల బాలిక తన కుటుంబంతో కలిసి జీవిస్తోంది. 7వ తరగతి చదువుతున్న ఆ బాలిక ప్రతిరోజూ అదేప్రాంతానికి చెందిన మరో బాలికతో కలిసి పాఠశాలకు వెళుతోంది. ఈ సమయంలో నేతాజీ బ్రిడ్జ్ సమీపంలోని ఓ యువకుడు వారితో అసభ్యకరంగా మాట్లాడుతూ వేధిస్తున్నాడు. ఈ విషయం బాలికలు తమ కుటుంబ సభ్యులకు చెప్పారు. 2018 జనవరి 11వ తేదీన నేతాజీ బ్రిడ్జ్ సమీపంలో ఉన్న ఆ యువకుడిని పట్టుకోవడానికి ప్రయత్నించగా పరారయ్యాడు. వేధింపులపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని బాలికల కుటుంబ సభ్యులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కష్ణలంక పోలీసులు సిఆర్ నెంబ 41/2018 అండర్ సెక్షన్ 354 (డి) ఐపిసి మరియు సెక్షన్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. కష్ణలంక సిఐ బి.శ్రీనివాస్ ఈ ఘటనపై విచారించి అదే జనవరి 13న నిందితుడైన కష్ణలంక రాణిగారితోటకు (ఉత్తరప్రదేశ్ రాష్ట్రం) చెందిన 21 ఏళ్ల షేక్ ఉస్మాన్ ఖాన్‌ను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు విచారణలో నిందితుడిపై నేరం రుజువుకావడంతో మంగళవారం జడ్జి డాక్టర్ ఎస్.రజిని రెండేళ్ల కఠినకారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. సదరు బాధిత బాలికలకు ఒక్కొక్కరికి జరిమానా నుండి రూ.4 వేలు, రూ.50 వేలు నష్టపరిహారం వచ్చేవిధంగా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీస్ అథారిటీని ఆదేశించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ గుజ్జుల నాగి రెడ్డి, సిఎంఎస్ ఇన్‌స్పెక్టర్, అప్పటి కష్ణలంక సిఐ బి.శ్రీనివాస్, సిఎంఎస్ సిబ్బంది పర్యవేక్షణలో ఏడుగురు సాక్షులను విచారించారు.

సిఎం ఆదేశాలతో సాయం పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం విజయవాడ కష్ణలంక రిటైనింగ్ వాల్, రివర్ వ్యూ పార్కు తదితర అభివద్ధి పనులను ప్రారంభించి తిరిగి వెళుతున్న సమయంలో పలువురు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి ఆర్థిక సహాయం కోరుతూ వినతిపత్రాలు అందించారు. ఈ నేపథ్యంలో సిఎం జారీ చేసిన ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఇద్దరికి రూ.2 లక్షల చొప్పున చెక్కులను కలెక్టర్ ఎస్.డిల్లీరావు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విస్సన్నపేట మండలం నరసాపురం గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మి, శ్రీనివాసరావు దంపతులు తమ ఆరేళ్ల కుమారుడు భానుతేజ కేన్సర్‌తో బాధపడుతున్నాడని, చికిత్స నిమిత్తం సాయం చేయాలని సిఎంను కోరారని తెలిపారు. అలాగే విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన 31 ఏళ్ల కంబా ఏడుకొండలు.. ప్రమాదంలో తన రెండు కాళ్లు కోల్పోయానని, తనకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. వారికి రూ.2 లక్షల చొప్పున సాయం అందించినట్లు తెలిపారు.



రూ.2 లక్షల చెక్కును అందజేస్తున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ఇవిఎంల భద్రతకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో ఈవీఎంలను భద్రపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. మంగళవారం గన్నవరం జడ్పీ బాలుర పాఠశాల్లో ఏర్పాటు చేసి స్ట్రాంగ్ రూమ్, పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గన్నవరం నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో ఈవీఎంలను భద్రపరుస్తున్నామని, పిల్లల చదువుకు ఏ విధమైన ఇబ్బందిగా కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసి గీతాంజలి శర్మ , ఎస్పీ అద్నాల్ నయీమ్, గన్నవరం తహశీల్దారు పవన్ కుమార్ పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

భూ కబ్జాలు చేసే నేతలను ఓడించండి

ఇళ్లను తొలగించి సుదూర ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు, వామపక్షాల పోరాటాలతో తాత్కాలికంగా కాల్వగట్ల ఇళ్ల తొలగింపు ప్రక్రియ ఆగిందన్నారు. భవిష్యత్తులో ఈ ప్రమాదం నుండి బయట పడాలన్నా, పేదల ఇళ్లు నిలవాలన్నా అసెంబ్లీలో బాధితుల తరపున మాట్లాడే కమ్యూనిస్టుల ప్రాతినిథ్యం ఉండాలన్నారు. అందుకే సెంట్రల్ నియోజకవర్గంలో సిపిఎంకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రజలపై వేల కోట్ల రూపాయల మేర భారాలు పడుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకునే పరిస్థితిలో లేరన్నారు. తమ ఆస్తులు పెంచుకోవడానికి భూకబ్జాలు చేసుకుంటూ, చివరికి స్వాతంత్ర్య సమరయోధుల స్థలాలను కూడా కబ్జా చేశారంటే సిగ్గు పడాలన్నారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలోని బిజెపితో కుమ్మక్కై వివిధ భారాలను ప్రజలపై మోపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులు కె.సరోజ, వై.సుబ్బారావు, వెలగా శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు బి.లక్ష్మణరావు, కోరుట్ల శ్రీను, కె.గురుమూర్తి, కె.రమణ, వి.గురుమూర్తి, సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా రిటైనింగ్ వాల్‌కు సిఎం ప్రారంభోత్సవం

చేశారు. వివిధ రకాల మొక్కలతో గ్రీనరీని అభివృద్ధి చేశారు. మోడ్రన్ ఎంట్రీ ప్లాజాతోపాటు సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లు, వాటర్ ఫాల్స్, రెయిలింగ్, లైటింగ్, సిట్టింగ్ ఏరియా, ఓపెన్ జిమ్, ప్లే ఏరియాను అధునాతన సౌకర్యాలతో అందంగా తీర్చిదిద్దారు. సందర్శకుల వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ ప్లేస్ కూడా అందుబాటులోకి తెచ్చారు. ఆకర్షణీయమైన కలర్‌ఫుల్ విద్యుత్ కాంతులను ఏర్పాటు చేశారు. సాయంత్రం, రాత్రి సమయాల్లో అయితే కళ్లు జిగేల్‌మనే విధంగా లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. అలాగే నగరంలోని వివిధ ప్రాంతాల్లో రూ.239 కోట్లతో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు శంకుస్థాపన చేశారు.

రెవెన్యూ అక్రమాలు

లక్షలకుపైగా చేతులు మారినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి..

కౌలు కార్డులు మంజూరులోనూ అక్రమాలు

ఘంటసాల మండలంలోని కొడాలి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో సాగు హక్కు ధ్రువీకరణ పత్రాల (సిసిఆర్‌సి) మంజూరులోనూ అక్రమాలు జరిగాయని తెలిసింది. కొడాలిలో భూ యజమాని, ఆ భూములు సాగు చేసే కౌలు రైతులకు తెలియకుండా 15 కార్డులు, కొత్తపల్లిలో ఏడు కార్డులు మంజూరు చేసినట్లు చేసినట్లు తెలిసింది. ఈ గ్రామాల్లో స్థానిక రెవెన్యూ అధికారుల బంధువుల పేర్లతోనే కార్డులు మంజూరు చేశారనే ఆరోపణలున్నాయి. ఈనేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ రికార్డులను పరిశీలించి దేవాలయ భూముల మ్యూటేషన్‌లో, సిసిఆర్‌సి కార్డుల మంజూరులో అక్రమాలకు పాల్పడిన అధికారులపైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఆలయ భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో భూముల వివరాలను సరిచేయాలని కోరుతున్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

జడ్‌పి చైర్‌పర్సన్ హారిక



స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న హారిక

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రానున్న వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని మంచినీటి చెరువులన్నీ నింపాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో స్థాయిసంఘ సమావేశంలో కృష్ణాజిల్లాలోని వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ దశల్లో పెండింగ్లో ఉన్న జిల్లా అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతో పాటు సమావేశంలో సభ్యులు లేవనెత్తిన ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులు శాయశక్తులా కృషి చేయాలని సూచించారు. విద్యా వైద్యం అంశంపై జరిగిన చర్చలో జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగే విధంగా తల్లులను ప్రోత్సహించాలని, అందుకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను వారికి వివరించాలన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో కళ్ల శస్త్ర చికిత్స చేయించుకునే ప్రతిఒక్కరికి రూ.1500 నగదు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులను ఆ దిశగా మోటివేట్ చేయాలని సూచించారు. జిల్లాలో పామాయిల్ తోటలు పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతున్న వరి, కూరగాయల సాగులో తక్కువ మోతాదులో పురుగు మందుల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మిచౌంగ్ తుపాను నష్టపరిహారం ఇంకా కొంతమంది రైతుల ఖాతాలకు జమ కాలేదన్న సమస్యను సభ్యులు లేవనెత్తగా వరుస సెలవులు కారణంగా జమ కాలేదని, త్వరలో మిగిలిన అందరికీ జమవుతాయని అధికారులు వివరణ ఇచ్చారు. ఏప్రిల్ మొదటి వారంలో తాగునీటిని విడుదల చేస్తారని, ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని, శివారు ప్రాంతాలకు తాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అవసరమైనచోట్ల ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాలని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా ఆగిరిపల్లి బాలికల సాంఘిక సంక్షేమ వసతి గహంలో స్టాఫ్ లేరని, అసలు పిల్లలు లేని వేరే ప్రాంతాల్లోని వసతి గహాల్లోని సిబ్బందిని అక్కడ కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని వైస్ చైర్ పర్సన్ కష్ణంరాజు కోరగా, ఈ ప్రతిపాదనను జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా ఇన్చార్జి మంత్రి దష్టికి తీసుకువెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో వి జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



14న బహిరంగ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-బంటుమిల్లి: రైతు, కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈ నెల 14న ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో బంటుమిల్లి, మల్లేశ్వరం, జానకిరాంపురం, లక్ష్మి నారాయణపురం తుమ్మిడి వరకు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కృత్తివెన్ను మండలంలో చిన్న పాండాక, మునిపెడ, నీలిపూడి గ్రామాలలో బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం నాయకులు మాట్డాఉతూ 14న బంటుమిల్లి, కృత్తివెన్ను మండలం కేంద్రాల్లో ఢిల్లీలో పోరాటం చేస్తున్న రైతులకు సంఘీభావంగా నిరసన ధర్నాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌరిశెట్టి నాగేశ్వరరావు, మాజేటి శ్రీనివాసరావు, కే.రవి, వంగల రాజా, లంకదాసుల అజయ్ ఘోష్, వెంట్రపాటి శ్యామసుందర్‌బాబు, వెంట్రపాటి రాంబాబు, పొదిలి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కూతురిపై తండ్రి అత్యాచారం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే ఆ బాలిక పట్ల కర్కసత్వంగా ప్రవర్తించాడు. దీనికి సంబంధించి ట్రైనీ డిఎస్పి వేదశ్రీ తెలిపిన వివరాల ప్రకారం వీరవల్లి గ్రామానికి చెందిన బాలిక తొమ్మిదో తరగతి చదువుతుంది. బాలిక తండ్రి పెయింటర్‌గా పని చేస్తున్నాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో గతేడాది డిసెంబర్ నెలలో కుమార్తెపై బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని బెదిరించాడు. ఇదే అదునుగా ఈ ఏడాది జనవరి నెలలో పలుమార్లు కుమార్తెపై అత్యాచారానికి ఒడిగట్టాడు. తండ్రి తన పట్ల ప్రవర్తించిన తీరును బాలిక తన తల్లికి వివరించింది. దీంతో భర్తను గట్టిగా ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పాటు ఇంటి నుంచి పారిపోయాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చంద్రశేఖర్ పర్యటన

ప్రజాశక్తి-అవనిగడ్డ

వైసిపి బందరు పార్లమెంట్ ఇన్చార్జిగా నియమితులైన డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ ఆయన తనయుడు రామ్ చరణ్‌తో కలిసి మంగళవారం పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు అవనిగడ్డలో వేంచేసి ఉన్న శ్రీలంక అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన స్వగ్రామం బందలాయి చెరువు గ్రామం వెళ్లి గ్రామంలోని రామాలయం, పోతురాజు ఆలయాలను సందర్శించారు. సీతయలంక వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి వెంకటేశ్వరరావు, దిడ్ల కిరణ్, అయ్యప్ప, మురళి తదితరులు పాల్గొన్నారు.

బాలిక మృతిపై బంధువుల ఆందోళన

ప్రజాశక్తి-అవనిగడ్డ

మోపిదేవి మండలం బొబ్బర్లంక గ్రామ కరకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడో తరగతి చదువుతున్న బొడ్డు దివ్యశ్రీ (8) మృతిచెందింది. ఇందుకు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాల వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు రాజశేఖర్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ నాయకులు ఏ శ్రీనివాస్, శ్రీకాంత్, నాగిడి సాంబశివరావు, కన్నా రాజేష్ పాల్గొన్నారు.



కెడిసిసి బ్యాంకు భవనం ప్రారంభం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని శేరికల్వపూడి గ్రామంలో కెడిసిసి బ్యాంక్ నూతన భవన ప్రారంభోత్సవం, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహావిష్కరణ మరియు సిమెంట్ రోడ్ శంఖుస్థాపన కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిధులుగా మాజీ మంఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వర రావు (నాని), జడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక రాము పాల్గొన్నారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చెయ్యడానికి ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి ప్రజల ముందుకు పాలనను తెచ్చిందని ఈ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుక్కుపాటి శశి భూషణ్, ఎంపిపి కొడాలి



సురేష్, ఎంపీడీవో నాగేశ్వరరావు, శాయన వెంకట పూర్ణ రవి కుమార్, పాలేటి చంటి కోగంటి ధనుంజయ్, గుదే రవి, కోటప్రోలు నాగు పాల్గొన్నారు.

ముస్తాబాదలో యార్లగడ్డ పర్యటన



ప్రజాశక్తి-గన్నవరం: మండలంలోని ముస్తాబాద గ్రామంలో టిడిపి నాయకులు యార్లగడ్డ వెంకట్రావుకు బ్రహ్మరథం పెట్టారు. గడపగడపకు శంఖారావం కార్యక్రమాన్ని గన్నవరం మండల టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ముస్తాబాద్ గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి, జనసేన ఉమ్మడిగా ప్రకటించిన మొదటి విడత మ్యానిఫెస్టో కరపత్రాలను అందజేశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ వైసీపీ నాయకులు చేస్తున్న ప్రకృతి విధ్వంసం క్షమించరానిదన్నారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన సహజ వనరుల్ని సద్వినియోగం చేసుకొని నియోజకవర్గ బాగు కోసం ఉపయోగించేలా టిడిపి, జనసేన ప్రభుత్వంలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి దొంతు చిన్నా, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి బోడపాటి రవి, మేడేపల్లి రమ, గుజ్జర్లపూడి బాబురావు పాల్గొన్నారు.

పోలీసు కవాతు

ప్రజాశక్తి-పెదపారుపూడి: జిల్లా ఎస్పీ నయీమ్ అస్మి ఆదేశాల మేరకు గుడివాడ సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీకాంత్ నేతృత్వంలో పామర్రు సిఐ వి.సుభాకర్ పర్యవేక్షణలో పెదపారపూడి ఎస్సై జి.రాజు కేంద్ర పోలీస్ బలగాలతో కలిసి మంగళవారం పెదపారుపూడి, మోపర్రు, ఎలమర్రు, వెంట్రప్రగడ, వానపాముల గ్రామాల్లో కవాతు నిర్వహించారు. పోలీసు వారు ఎప్పుడు ప్రజలకు అండగా ఉంటారని ప్రజలు ఎటువంటి అపోహలకు గురి కావద్దని ప్రతి ఒక్కరికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసు వారిదేనని తెలిపారు. నిర్భయంగా ప్రజలందరూ వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

ఉయ్యూరు: సాధారణ ఎన్నికల ప్రక్రియ సమీపిస్తున్న తరుణంలో ఏవిధమైన సందేహాలకు లోను కాకుండా ప్రతి



ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలియజేస్తూ ఉయ్యూరు, గండిగుంట, కాటూరు, ముదునూరు గ్రామాల్లో మంగళవారం పోలీసు ప్రత్యేక దళం కవాతు నిర్వహించింది. పట్టణ సీఐ హబీబ్ భాష, ఎస్సై గణేశ్ కుమార్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై అవినాశ్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

సిసి రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-పమిడిముక్కల: వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వం అని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం పమిడిముక్కల మండలంలోని వేల్పూరు, అయినంపూడి, ముల్లపూడి గ్రామాల్లో రూ.45 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిఇ శ్రీనివాస్, ఎఇ షరాబంధిరాజు, సర్పంచులు రత్నం దిలీప్‌కుమార్, అంజిబాబు, ఏనుగ బేబీ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: హనుమాన్ జంక్షన్ కూడలి నుంచి ప్రధాన రహదారుల వెంబడి ఫుట్పాత్, డ్రైనేజీలపై చొచ్చుకువచ్చిన ఆక్రమణల తొలగింపునకు హనుమాన్ జంక్షన్ పోలీసులు చర్యలు చేపట్టారు. మంగళవారం హనుమాన్ జంక్షన్ సిఐ అల్లు నవీన్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ ఎస్సైలు జనార్ధన్, అజ్జమ్మ, ట్రైని డిఎస్పి వేదశ్రీ తమ సిబ్బంది కలసి ఆక్రమణల తొలగింపు పనులు ప్రారభించారు. మూడు శాఖల సిబ్బందితో పూర్తిస్థాయిలో ఆక్రమణలను తొలగింపునకు చర్యలు చేపడతామని సిఐ మూర్తి స్పష్టం చేశారు.



ఎన్విరోటెక్ ఫౌండేషన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గౌరవరం గ్రామపంచాయతీ పరిధిలోని కొంగర మల్లయ్య గట్టు వెనుక గల 8.84 ఎకరాల విస్తీర్ణంలో వేదాద్రి ఎన్విరోటెక్ ఫౌండేషన్ ఏర్పాటుకు పర్యావరణ అనుమతికి మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నందిగామ ఆర్‌డిఒ రవీంద్రరావు, పర్యావరణ ఇఇ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఫ్యాక్టరీ యాజమాన్యం మాట్లాడుతూ 34 కంపెనీలలో వ్యర్థాలను స్వీకరించి శుద్ధి చేసే కేంద్రం స్థాపించనున్నట్లు తెలిపారు. ఈ ఫ్యాక్టరీ 150 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్నట్లు, 100 మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతం చుట్టూ పది కిలోమీటర్ల ప్రాంతంలో అధ్యయనం చేసి ఈ ఫ్యాక్టరీ స్థాపించనున్నట్లు తెలిపారు. ఎటువంటి కాలుష్యం ఉండదని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న గ్రామాల్లో సిఎస్‌ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి చేయడంతో పాటు ఈ ప్రాంతంలోని అర్హులైన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గౌరవరం గ్రామానికి చెందిన ముత్తవరపు వెంకటేష్, బుజ్జిబాబు మాట్లాడుతూ ఈ ఫ్యాక్టరీకి రోడ్డు వేయుటకు కొంగర మల్లయ్య గట్టు సమీపంలో గల కాలువను పూడ్చి వేసినట్లు తెలిపారు. ఈ కాలవ నుండి వచ్చే నీరు గౌరవర గ్రామ చెరువుకు వస్తుందని కాలువ పూడుకుపోతే చెరువులో నీరు కూడా వచ్చే పరిస్థితి లేదని దీంతో చేరువు ఎండి పోయే ప్రమాదం ఉందని తక్షణమే కాలువను పునరుద్ధరించాలని కోరారు. మరి కొంతమంది స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎన్జీవోలు మాట్లాడుతూ సిఎస్‌ఆర్ నిధుల ద్వారా ఫ్యాక్టరీ సమీపంలోని సుమారు పదివేల



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర

మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఈ ఫ్యాక్టరీ స్థాపనతో ఈ ప్రాంతంలోని యువతకు మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎటువంటి పొల్యూషన్ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీవో రవీంద్రరావు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చినటువంటి అభిప్రాయాలన్నిటినీ వీడియో రికార్డ్ చేశామని, రికార్డ్ చేసినవన్నీ న్యూఢిల్లీ పర్యావరణ అనుమతికి పంపించనున్నట్లు అక్కడి నుండి వచ్చే నివేదికను ఆధారం చేసుకుని ఫ్యాక్టరీ నిర్మాణ విషయంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శేషగిరి, ఫ్యాక్టరీ యాజమాన్యం, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఎన్జీవోస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిఎం ఉన్నత విద్య పథకానికి మైలవరం కళాశాల ఎంపిక

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్ పథకానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈళ్ల రవి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ పథకం క్రింద రాబోయే మూడు సంవత్సరాలలో కళాశాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్లను కేటాయించనున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 కళాశాలలు ఎంపిక కాగా ఎన్టీఆర్ జిల్లా నుండి డాక్టర్.లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంపిక కావడం విశేషం అన్నారు. జాతీయ విద్యా విధానం 2020 ని అనుసరించి ఉన్నత విద్యా సంస్థలలో విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇవ్వడానికి, నాణ్యతా ప్రమాణాలు పెంపొందించడానికి, శాస్త్ర సాంకేతికతను జోడించి విద్యాబోధన అందించడానికి, ఉపాధ్యాయ అవకాశాలు పెంపొందించే అధునాతన డిగ్రీ కోర్సులు నెలకొల్పటానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఐఏఎస్ ప్రోబలం, సహకారంతో ఈ పథకానికి కళాశాల దరఖాస్తు చేసుకుందని, వచ్చే మూడేళ్లలో కళాశాల అభివద్ధి చెందటానికి ఇది గొప్ప అవకాశం ఈ సందర్భంగా డాక్టర్ పోలా భాస్కర్ కు ప్రిన్సిపల్ కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని, మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే తన కాళ్ల మీద తాను నిలబడి తన పిల్లలను కుటుంబానికి, తద్వారా సమాజానికి ఉపయోగపడేలా ఉంటారని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చట్ట సభల్లో కూడా మహిళలకు ప్రాధాన్యత పెరగాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏ.ఎన్.కుసుమ కుమారి మాట్లాడుతూ గతంలో ఉన్న అనేక సామాజిక దురాచారాలు, సతీ సహగమనం, వితంతు పునర్వివాహం, మీద ఆంక్షలు, కన్యాశుల్కం గురించి ఎంతో మంది పోరాడి రూపు మాపారన్నారు. నేడు ఆధునిక యుగంలో ఇంకా సమాజంలో మహిళలు ఇంకో రూపంలో వివక్షకు గురవుతున్నారని ఆందోళన


ఉపాధ్యాయినీలను సన్మానించిన యుటిఎఫ్ నాయకులు

వ్యక్తం చేశారు. యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా సహాధ్యక్షురాలు డి.అపర్ణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. రాష్ట్ర కార్యదర్శి యస్.పి. మనో హర్ కుమార్, యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, ఏ.సుందరయ్య ఉపాధ్యాయులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో పారా మిలటరీ బలగాల కవాతు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం, ఏ కాలనీ, ఫెర్రీ, సమస్యాత్మక ప్రాంతాల్లో ఎన్నికల బరిలో పటిష్ఠ భద్రత చర్యలకు ఏర్పాట్లలో భాగంగా మంగళవారం ఇబ్రహీంపట్నంలో వెస్ట్ జోన్ ఎసిపి మురళీ కృష్ణా రెడ్డి పారా మిలటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడమే లక్ష్యంగా పోలీసు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఎసిపి తెలిపారు. విటిపిఎస్ ఏ కాలనీ నుండి ఫెర్రీ, జాకీర్ హుస్సేన్ కాలేజీ రోడ్డు వరకు ఎలక్షన్ నిమిత్తం సెంట్రల్ ఫోర్సు, స్థానిక పోలీసు వారిచే ఫ్లాగ్ మార్చు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


కవాతులో పాల్గొన్న పోలీసులు


సిఎంను కలిసిన కర్నాటి

సిఎంను మర్యాద పూర్వకంగా కలిసిన దుర్గగుడి చైర్మన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కృష్ణానది రిటైనింగ్ వాల్ అండ్ రివర్ ఫ్రంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంగళవారం విజయవాడ విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సిఎంతో రిటైనింగ్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.


వృద్ధాశ్రమానికి సాయం చేసిన విద్యార్థులు, క్లబ్ మెంబర్స్

అమ్మ వృద్ధాశ్రమానికి సాయం

విజయవాడ : సమాజానికి సేవ చేయాలనే మానవతా దృక్పథంతో గుడ్ హ్యాబిట్స్ క్లబ్ మెంబర్స్, పిబి సిద్ధార్థ కళాశాల మొగల్రాజపురం విద్యార్థులు సంయుక్తంగా తమ వంతు సాయం అమ్మవృద్ధాశ్రమానికి అందజేశారు. తాము దాచుకున్న పొదుపు నగదులో నుండి వారి శక్తి మేరకు ఈ సాయం చేయడంపై అమ్మ వృద్ధాశ్రమం నిర్వాహకులు రాంబాబు ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో రాంబాబు మాట్లాడుతూ చిన్ననాటి నుండి సేవా దృక్పథం అలవర్చుకోవడం ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దబడతారని అన్నారు. అనంతరం గుడ్ హ్యాబిట్స్ క్లబ్, కోఆర్డినేటర్ డా.రోహిణి కుసుమ మాట్లాడుతూ బాధ్యతతో కూడిన జీవితాన్ని గడపడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిబి సిద్ధార్థ కళాశాల విద్యార్థిని విద్యార్థులు, గుడ్ హ్యాబిట్స్ క్లబ్ మెంబర్స్, అమ్మ వృద్ధాశ్రమంలోని వారు తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లోనే ఎక్కువగా విటమిన్ డి లోపం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ఎక్కువ మంది మహిళల్లో విటమిన్ డి లోపం కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అపోలో క్లినిక్ కన్సల్టెంట్ ఆర్థోపెడిషియన్ డాక్టర్ సిద్ధార్థ పొట్లూరి తెలిపారు. అపోలో కిన్లిన్‌లో అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విటమిన్ డి లోపం కారణంగా మహిళలు నొప్పులతో పాటు పలు సమస్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాత్కాలిక నొప్పి ఉపశమన పరిష్కారాలను మహిళలు పొందుతున్నారని కాని పునరావృత ఎముకల నొప్పిని సాధారణంగా చూస్తున్నారన్నారు. కానీ దాని మూల కారణమైన విటమిన్ డి లోపాన్ని గుర్తించడంలో విఫలమవుతున్నారన్నారు. ఇటీవల కాలంలో జరిగిన సర్వేలో 52,754 మందిని స్త్రీలను పరీక్షించగా 80 శాతం మంది విటమిన్ డి లోపంతో ఉన్నారన్నారు. విటమిన్ డి తగినంతగా ఉత్పత్తి కావాలంటే మన శరీరంలో కనీసం 40 శాతం సూర్యరశ్మి పొందేవిధంగా దుస్తులు ధరించడంతో పాటు కనీసం 20 నిముషాలు ప్రతిరోజూ సూర్యరశ్మి పడేలా చూసుకోవాలన్నారు. విటమిన్ డి లోపాన్ని నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.

స్పెల్ బి విజేతగా నవీన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎస్‌బిఐ స్పెల్ బి సీజన్ 13 ఛాంపియన్ విజేతగా రాయన్ నవీన్ సిద్దిఖీ నిలిచాడని సంస్థ ప్రతినిధి కె.ఎం.ఎస్.ఆర్.రావు తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించేందుకుగానూ స్పెల్ బీ సంస్థ ప్రతి ఏటా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా స్కాటిష్ స్కూల్‌కు చెందిన రాయన్ నవీన్ విజేతగా నిలిచాడని తెలిపారు. అదే పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఆదితా నాగ్ గ్రాండ్ ఫినాలేలో ప్రతభ కనపరిచాడని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్పెల్ భీ పోటీల్లో విజేతగా లక్ష రూపాయల నగదు బహుమతిగా అందిస్తున్నామన్నారు. దీనితో పాటు విదేశీ ప్రయాణం అవకాశం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో విద్యార్థులకు నైపుణ్యతను పెంపొందించేలా మరిన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

ప్లాటినం జ్యూయలరీ పట్ల ఆసక్తి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ఇటీవల కాలంలో ప్లాటినమ్ జ్యూవెలరీ ఆభరణాల పట్ల ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారని పీజీఐ ఇండియా బిజినెస్ డైరెక్టర్ పల్లవి శర్మ తెలిపారు. నగరంలోని ప్లాటినమ్ జ్యూయలరీ షోరూమ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వివరాలను తెలిపారు. ప్లాటినమ్ ఆభరణాలు ఈ ఏడాది కాలంలో కొత్త స్టైల్ ట్రెండ్‌లతో సరికొత్త డిజైన్లను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళల జీవనశైలికి అనుగుణంగా సమకాలీన డిజైన్లు, ఆధునిక మహిళలకు సరికొత్త విభాగాన్ని సృష్టించే విధంగా డిజైన్లను ఆవిష్కరించినట్లు తెలిపారు. 95 శాతం స్వచ్ఛమైన ప్లాటినమ్‌తో రూపొందించిన ప్లాటినం ఎవారా ఆభరణాలు ఎక్కువ మందిని ఆకట్టుకునే విధంగా తీసుకువచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా శుభకార్యాలు, ఫంక్షన్లకు ప్లాటినం ఎవారా ఆభరణాలను ఎక్కువ మంది ఇవ్వడానికి ఇష్టపడుతున్నారన్నారు. ప్రముఖ జ్యూయలరీ సంస్థలలోనూ, రిటైల్ స్టోర్లలోనూ ప్లాటినం ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

టాటా గ్లూకో ప్లస్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వేసవి సందర్భంగా నూతన ఉత్పత్తులను పరిచయం చేయాలనే ఉద్దేశంతో టాటా గ్లూకో ప్లస్ పేరుతో వేసవి ప్రచారాన్ని ప్రారంభించినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ అమరేందర్ తెలిపారు. నగరంలోని టాటా సంస్థ కార్యాలయంలో మంగళవారం ఉదయం ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాటా గ్లూకో చక్కటి ఉత్పత్తులను వినియోగదారులకు అందించడంతో పాటు అద్భుతమైన ఆఫర్ కూడా అందిస్తుందన్నారు. ఇందులో భాగంగా టాటా గ్లూకో ప్లస్ ఉత్పత్తిని కొనుగోలు చేసి ప్యాక్‌పై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలన్నారు. ఈ విధంగా స్కాన్ చేసిన సందర్భంగా వచ్చిన నెంబర్‌ఆధారంగా అర్జెంటీనాలో జరుగనున్న ఫుట్‌భాల్ మ్యాచ్‌ను వీక్షించే అవకాశం కూడా కల్పిస్తున్నామని తెలిపారు.